తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
30 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :



## నేడు కరీంనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

### ○నూతన సమీకృత కలెక్టరేట్ ప్రారంభం○ ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేడు కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల పై పలు సూచనలు చేశారు.
నూతన సమీకృత కలెక్టరేట్ భవనం వద్ద పూల అలంకరణ, పరిశుభ్రత, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ తదితర అంశాల పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్‌ను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నేడు కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, అనంతరం నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొని, కలెక్టర్‌ను వారి సీటులో ఆసీనులను చేసి అధికారికంగా విధుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సమగ్ర అభివృద్ధి పై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అర్బన్ డెవలప్‌మెంట్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నారు.

**కరీంనగర్ అభివృద్ధికి ప్రజాపాలన ప్రభుత్వం కట్టుబడి ఉంది**

కరీంనగర్ అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. శాతవాహన యూనివర్సిటీలో గత పదేళ్లుగా వీసీ నియామకం జరగలేదని విమర్శించారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజనీరింగ్ వంటి విద్యా అవకాశాలను పెంచడంతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఎల్లంపల్లి, లోయర్ మానేరు, మిడ్ మానేరు, అప్పర్ మానేరు, గౌరవెల్లి, కలికోట సూరంపేట తదితర ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణకు రూ.250 కోట్లు కేటాయించామని, మిడ్ మానేరు వార్త లోపలి పేజీలో

## బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలి రావాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్



**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 29 (జనంసాక్షి)** ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్లకు వస్తున్నందున సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పక్షాన, ఉమ్మడి జిల్లా పక్షాన ప్రతి ఒక్క కార్యకర్త ఈ సమావేశానికి తరలిరావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిరిసిల్లలో నేడు 30వ తేదీన జరిగే బహిరంగసభాస్థలిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో 33 నెలలుగా తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం నడుస్తోందని. చెప్పిన విధంగానే రైతాంగం, కార్మికులు, విద్యార్థుల సంక్షేమానికి మరియు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని అన్ని దిశలా అభివృద్ధి చేసే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు పోతోందని అన్నారు.ప్రతిపక్షాలు బాధ్యతగల రీతిలో ప్రవర్తించకుండా విచ్ఛిన్నకరమైన విధానాలతో ముందుకు పోతున్నాయని, రాష్ట్రంలోబి, ఆర్ , ఎస్,నేతలు ఏదైనా దురదృష్టకర సంఘటన జరిగినా, వర్షాలు పడకపోయినా సంతోషపడే వాతావరణం ఉందని విమర్శించారు.తమ ప్రభుత్వం సానుకూలంగా, ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచనతో పనిచేస్తోందని, ఎల్ నినో వల్ల కరువు ఏర్పడుతున్న తరుణంలో, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు తేవాల్సిన సమయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయనిప్రతిపక్షాలకు జ్ఞానోదయం కలిగించేలా సిరిసిల్ల వేదిక నుంచే ముఖ్యమంత్రి ఒక సందేశం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.ఏ ఒక్క రూపాయి చార్జీలు, విద్యుత్ చార్జీలు లేదా ఇతర పన్నుల భారం ప్రజలపై వేయలేదని వ్యవసాయ ,కార్మిక ,విద్యా ,వైద్య మౌలిక సంక్షేమ కార్యక్రమాలు చేస్తుందని పేర్కొన్నారు.బాధ్యత గల ప్రతిపక్షం తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి కానీ విచ్ఛిన్నం అయ్యేలా వ్యవహరిస్తుందని అన్నారు.గత ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు అమలు చేస్తున్నామన్నారు.ఎల్ నినో ప్రభావం తో వర్షాభావ పరిస్థితుల్లో అందరూ కలిసి రాష్ట్రానికి నిధులు రావాల్సిన విషయంలో కూడా రాజకీయం చేస్తున్నారన్నారు.ముఖ్యమంత్రి గారు సిరిసిల్ల వస్తున్నారు భవిష్యత్ ఆందోళనలో బి, ఆర్ ఎస్ కనిపిస్తుందన్నారు.ప్రజల సంక్షేమం అభివృద్ధిలో ఆర్థిక భారం ఉన్న ముందుకు పోతుంది..ఎవరిపైనా పన్నుల భారం లేకుండా అనేక సంక్షేమా భివృద్ధి కార్యక్రమాలు చేస్తుందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 గ్యాస్ సబ్సిడీ,నూతన రేషన్ కార్డులు పంపిణీ ,సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘాలకు 5-10 లక్షలు వడ్డీలేని రుణాలు అందివ్వడం ,నిరుద్యోగులకు దాదాపు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేయడం లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, విజయ రమణారావు, వేముల వీరేశం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, కేకే మహేందర్ రెడ్డి, సూర దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా జిల్లా ప్రతినిధులకు అభినందనలు..




కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 (జనం సాక్షి) తెలంగాణ రాష్ట్రంలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా రెండో అత్యధిక సభ్యత్వ నమోదును సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా కామారెడ్డి జిల్లా ప్రతినిధులకు అభినందనలు, ప్రశంసలు అందాయి.గవర్నర్ సమక్షంలో రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్ పాల్గొన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సంస్థలు, ప్రజాప్రతినిధులు, ఇతర భాగస్వాములు సమన్వయంతో కృషి చేశారు.జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి, సేవా స్ఫూర్తి, మానవతా దృక్పథంతో చేపట్టిన కార్యక్రమాల ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని అధికారులు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత విస్తృతం చేయాలని సూచించారు.
రాబోయే సంవత్సరంలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో తెలంగాణ రాష్ట్రంలో కామారెడ్డి జిల్లాను మొదటి స్థానంలో నిలిపే లక్ష్యంతో మరింత ఉత్సాహంతో పనిచేయాలని అధికారులు ఆకాంక్షించారు. జిల్లాకు ఈ గుర్తింపు తీసుకురావడంలో భాగస్వాములైన ప్రతి అధికారి, సిబ్బంది, రెడ్‌క్రాస్ సభ్యులు, సంస్థలు, ప్రజాప్రతినిధులకు జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

### ఒడ్డెలింగాపూర్ గిరిజన మినీ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్



**రాయికల్ సెప్టెంబర్ 29 జనంసాక్షి:** మండలంలోని ఒడ్డెలింగాపూర్ గిరిజన మినీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు.విద్యనే భవిష్యత్తుకు బలమైన పునాదిగా భావించి, క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని వంటశాల,సామగ్రి నిల్వ గది, విద్యార్థుల వసతి గదులు,తరగతి గదులను పరిశీలించి అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత కోతుల బెడద అధికంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా,విద్యార్థుల వసతి గదుల మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్స్,పరిసర ప్రాంతంతో పాటు నీటి శుద్ధి కేంద్రం వద్ద అవసరమైన గ్రిల్లింగ్ పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే వర్షపు నీరు మెట్లపైకి చేరకుండా రక్షణ కోసం రేకులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న కొత్త భోజనశాల భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము,ఎంపీడీవో బింగి చిరంజీవి, తహసీల్దార్ ఎస్. నాగార్జున, ప్రధానోపాధ్యాయురాలు జె. శ్రీలత,సర్పంచ్ నాగుల మానస, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో వివాదాలకు సత్వర పరిష్కారం

## డీఎల్ఎస్ఏ కార్యదర్శి యశ్వంత్ సింగ్

**కరీంనగర్ లీగల్, సెప్టెంబర్ 29(జనంసాక్షి):** వివాదాలను సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు వెళ్లకుండా పరస్పర అంగీకారంతో, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం సమర్థవంతమైన మార్గమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీ యశ్వంత్ సింగ్ గారు తెలిపారు. ఈ రోజు జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవనంలో పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు ఆధ్వర్యంలోని తెలంగాణ మధ్యవర్తిత్వం మరియు ఆర్బిట్రేషన్ కేంద్రం నిర్వహిస్తున్న "దేశానికి మధ్యవర్తిత్వం 3.0 ? మీడియేషన్ ఫర్ ది నేషన్ 3.0" కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో మధ్యవర్తిత్వంపై మరింత అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలకు సత్వర పరిష్కారం, ఖర్చు తగ్గింపు, సంబంధాల పరిరక్షణ, న్యాయపరమైన వివాదాల తగ్గింపు వంటి ప్రయోజ నాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఇరుపక్షాలు పరస్పరం చర్చించుకుని అంగీకారంతో పరిష్కారాన్ని పొందే అవకాశం ఉండటం మధ్యవర్తిత్వం ప్రత్యేకత అన్నారు. కుటుంబ, ఆస్తి, వాణిజ్య తదితర వివాదాల్లో చట్టపరమైన పరిధిలో మధ్యవర్తిత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవచ్చని తెలిపారు.



కరీంనగర్ జిల్లా ప్రజలు తమ వివాదాల పరిష్కారం కోసం జిల్లా న్యాయ సేవా సంస్థ సేవలను సద్వినియోగం చేసుకునే విధంగా పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలని యశ్వంత్ సింగ్ సూచించారు. సమావేశానంతరం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# నేడు కరీంనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

ప్రాజెక్టు బాధితుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

**కరీంనగర్ పై సీఎం ప్రత్యేక దృష్టి**

మానేరు రివర్‌ఫ్రంట్, డంపింగ్ యార్డ్, కరీంనగర్ రింగ్‌రోడ్డు తదితర కీలక అంశాలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో ఉన్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కరీంనగర్ పర్యటన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు వెళ్లనున్నారు. అక్కడ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించి, అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. నేతన్నల సమస్యలు, పాత బకాయిల చెల్లింపుతో పాటు చేనేత, పవర్‌లూమ్ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా కల్పించనున్నారని మంత్రి తెలిపారు. సీఎం పర్యటన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో కామ్గర్ కరంఛారి కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ సమీర్ రాక..

## ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు.

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 జనం సాక్షి:** నిజామాబాద్ కేంద్రంలో కామ్గర్ కరంఛారి కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ సమీర్ పర్యటించారు. ఈ సందర్భంగా సుభాష్‌నగర్‌లోని అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు సుభాష్ జాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేందర్ ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది.

**కామ్గర్ కరంఛారి కాంగ్రెస్ విశిష్టత.**

కామ్గర్ కరంఛారి కాంగ్రెస్ అనేది అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఒక ముఖ్యమైన అనుబంధ విభాగం. సమాజంలో అసంఘటిత రంగంలో శ్రమించే కార్మికులు, ఉద్యోగులు మరియు వివిధ వృత్తి దారుల హక్కుల పరిరక్షణ కోసం ఈ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటయింది. దేశవ్యాప్తంగా అసంఘటిత కార్మికులకు తగిన సామాజిక భద్రత, కనీస వేతనాలు, మెరుగైన పని వాతావరణం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే ఈ అనుబంధ సంఘం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. పార్టీకి, కార్మిక లోకానికి మధ్య వారధిలా నిలబడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం ఈ విభాగం నిరంతరం శ్రమిస్తుంది.

నిజామాబాద్‌లో ఆత్మీయ కలయిక మరియు విశేషాలు

కామ్గర్ కరంఛారి కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమీర్ నిజామాబాద్ పర్యటనకు విచ్చేయడం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్‌ను నింపింది. ఈ నేపథ్యంలో సుభాష్‌నగర్‌లోని అతిథి గృహంలో ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు సుభాష్ జాదవ్ ఆయనను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో కార్మిక సంక్షేమం, రాబోయే కార్యక్రమాలు మరియు పార్టీ బలోపేతంపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. నాయకుల పరస్పర మర్యాదపూర్వక కలయిక స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఐక్యతను చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో సుభాష్ జాదవ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేందర్ తదితర ప్రముఖ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## చెవిటి మూగ విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

### నిర్వహించిన గ్రేసీ ఆర్గనైజేషన్ ఫర్ డెవలప్మెంట్ సర్వీసెస్

### పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జ్ ముద్దసాని నీలిమ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 జనం సాక్షి:** నిజామాబాద్ జిల్లా బోర్గాం పాంగ్ర లో గల చెవిటి మూగ విద్యార్థులకు గ్రేసీ ఆర్గనైజేషన్ ఫర్ డెవలప్మెంట్ సర్వీసెస్ సంస్థ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ముద్దసాని నీలిమ హాజరయ్యారు. ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడవద్దని వారికి చేసే సేవే భగవంతుని సేవగా భావించి వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్రేసీ ఆర్గనైజేషన్ ఫర్ డెవలప్మెంట్ సర్వీసెస్ సంస్థ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు. ఇట్టి కార్యక్రమానికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రజనీకాంత్ ఈఎన్టి స్పెషలిస్ట్, డాక్టర్ సంజీవ్ జనరల్ మెడిసిన్, డాక్టర్ శివాని జూడ, డాక్టర్ వీరస్వామి జూడలు పాల్గొని పరీక్షలు నిర్వహించడం నిజంగా గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందాని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి చైర్మన్ విద్యార్థుల డాక్టర్ సంజీవ్ గ్రేసీ ఆర్గనైజేషన్ స్టాప్, డి ఎల్ ఎస్ ఏ స్టాప్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కొరకు స్థల పరిశీలన

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 జనంసాక్షి:** అర్బన్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు కోరడం జరిగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం గుండారం శివారులో స్థలాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాలకు అవసరమైన 25 ఎకరాల స్థలం అర్బన్ లో కష్టతరమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో నగరానికి దగ్గరగా ఉన్న గుండారంలో పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే నగరంలోనూ మరో స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు. నియోజకవర్గం విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే మొదటి దశలో జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు మంజూరయ్యాయన్నారు. రెండో దశలో అర్బన్ లోనూ మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట రూరల్ తహసీల్దార్ వినయ్ సాగర్, టీఎస్ఈడబ్ల్యూఐసీ ఈఈ రవీందర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం రైతులు పండించిన పంటను మొత్తాన్ని కొనుగోలు చేయాలి

## సకాలంలో ఎరువులు అందించాలి..

## మొండి బకాయిలు వసూలు చేయాలి

**సదాశివనగర్, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** రైతులు పండించిన పంట మొత్తాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి గిట్టుబాటు కల్పించాలని, సాగు అవసరాలకు ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండ్ చేశారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, సొసైటీలకు రావాల్సిన మొండి బకాయిలను కఠినంగా వసూలు చేయాలని కోరారు. సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి, ఉత్తునూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో విండో మహాజన సభలు ఘనంగా నిర్వహించారు. పద్మాజివాడిలో సొసైటీ చైర్మన్ లోకోటి సుబ్బారావు, ఉత్తునూర్‌లో సొసైటీ చైర్మన్ కే. ప్రభాకర్ రావు అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శులు నయీమ్, దేవేందర్ 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ చివరి



వరకు జరిగిన ఆడిట్ వివరాలతో పాటు ఆదాయ, వ్యయాలను సభలో చదివి వినిపించారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంట చేతికొచ్చిన సమయంలో కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం పూర్తి స్థాయిలో పంటను కొనుగోలు చేయాలని కోరారు. ఎరువుల కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో సకాలంలో సరఫరా చేయాలని, రైతులు ఇబ్బందులు పడకుండా సహకార సంఘాల్లో అవసరమైన నిల్వలు ఉంచాలని సూచించారు. సొసైటీలకు దీర్ఘకాలంగా చెల్లించాల్సిన మొండి బకాయిలను వసూలు చేసి సంఘాల ఆర్థిక పరిపుష్టికి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారులు, పాలకవర్గాలు ప్రాధాన్యతగా పరిగణించి పరిష్కరించాలని సభలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సహకార సంఘాలు రైతులకు మరింత చేరువగా పనిచేసి వ్యవసాయ రంగానికి అండగా నిలవాలని పలువురు పేర్కొన్నారు.

కార్యక్రమాల్లో సర్పంచులు మొగుళ్ల శ్రీనివాస్ గౌడ్, లోకోటి సుబ్బారావు, ఉపసర్పంచ్ రాజయ్య, సీఈవోలు నయీమ్, దేవేందర్, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు

# సెప్టెంబర్ 30లోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి చేయాలి

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

- ప్రతి రైతు సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- డిజిటల్ పంటల సర్వే లేక ఏ ఒక్కరైతు కూడా సన్న రకం ధాన్యం బోనస్ కోల్పోకూడదు

**పెద్దపల్లి,సెప్టెంబర్ 29(జనంసాక్షి) :**
ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను వేగవంతం చేసి, సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల డిజిటల్ పంటల సర్వేపై సంబంధిత అధికారులతో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులతో సమీక్షా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న డిజిటల్ పంటల సర్వే పురోగతి, రైతుల సాగు వివరాల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సెప్టెంబర్ 30లోగా పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ పొందేందుకు డిజిటల్ పంటల సర్వే వివరాలు కీలకమని తెలిపారు. డిజిటల్ పంటల సర్వే పూర్తికాకపోవడం వల్ల సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న ఏ ఒక్క రైతు కూడా బోనస్ కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతుకు సంబంధించిన పంట వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఏఈఓలు, వ్యవసాయ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. రైతుల నుంచి అవసరమైన వివరాలను సేకరించి, సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా



సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మండలాల వారీగా సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా జాప్యం ఉంటే వెంటనే గుర్తించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.



గ్రామాల్లో ఎంపిక చేయబడిన వాలంటీర్లను పర్యవేక్షిస్తూ,ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా డిజిటల్ పంటల సర్వేను పూర్తిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్,మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష

- పెద్దపల్లి పట్టణంలోని జంక్షన్ల వద్ద ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టాలి
- సుల్తానాబాద్--కాట్నపల్లి నిరుకుళ్ల వద్ద యూ టర్న్ ఏర్పాటు చేయాలి
- ప్రతి పాఠశాల వద్ద తప్పనిసరిగా స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలి
- రోడ్డు భద్రత ప్రమాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి,సెప్టెంబర్ 29(జనంసాక్షి) :**
జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత ప్రమాణాల అమలు, తీసుకోవాల్సిన చర్యలపై లిఅదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీలి తో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని జంక్షన్ల వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.సుల్తానాబాద్--కాట్నపల్లి నిరుకుళ్ల వద్ద గ్రామసభ తీర్మానం మేరకు అవసరమైన చోట యూ టర్న్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.రోడ్డుపై పశువులను వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం రూ.10 వేల జరిమానా విధించి, పశువులను గోశాలలకు తరలించాలని ఆదేశించారు.పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, హెచ్‌కేఆర్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన మేర రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.రోడ్డు విస్తరణ సజావుగా జరిగేలా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని సంబంధిత వీధి వ్యాపారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు.పట్టణంలోని డివైడర్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.టౌన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన యూ టర్న్‌లను సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రామగుండం నగరంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు స్ట్రిప్స్, రేడియం స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక ట్రాఫిక్ ఉండే జంక్షన్ల వద్ద ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు.ప్రతి పాఠశాల వద్ద స్కూల్ జోన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని,హిట్ అండ్ రన్ కేసుల బాధితులకు నష్టపరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరగా పంపాలని పోలీస్ అధికారులకు సూచించారు.జిల్లాలోని రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. లారీలు, ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలు, కార్ల ముందు, వెనుక భాగాల్లో తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.హెల్మెట్ ధరించకపోవడం, ట్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటి వాటి వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇవి చట్టవిరుద్ధమైన చర్యలని ప్రజలకు తెలియజేస్తూ రోడ్డు భద్రత నిబంధనలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, రోడ్డు భద్రత ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# వరి నుంచి ఆయిల్‌పామ్ వైపు ప్రతి రెండు నెలలకు ఆదాయం పొందుతున్న రైతు

## జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్



**పెద్దపల్లి,సెప్టెంబర్ 29(జనంసాక్షి) :**
సంప్రదాయ వరి సాగు నుంచి ఆయిల్‌పామ్ సాగుకు మారిన వావిలాల రాజేశ్వర రావు, ఎలిగేడు మండలం లోకపేట గ్రామం అనే రైతుప్రస్తుతం ప్రతి రెండు నెలలకు ఒకసారి దిగుబడి ద్వారా ఆదాయం పొందుతూ విజయవంతమైన ఆయిల్‌పామ్ రైతుగా నిలుస్తున్నారనీ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యాం ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వరి సాగు చేసిన వావిలాల రాజేశ్వరి రావు, నీటి వినియోగం, సాగు ఖర్చులు మరియు దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని ఆయిల్‌పామ్ సాగును చేపట్టారు. ప్రస్తుతం ఆయన తోట దిగుబడికి రావడంతో ప్రతి సుమారు రెండు నెలలకు ఒకసారి ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ (ఎఫ్ ఈ బి) విక్రయించి ఆదాయం పొందుతున్నారు.ఆయిల్‌పామ్ తోట స్థిరపడిన తరువాత క్రమం తప్పకుండా దిగుబడి పొందే అవకాశం ఉండటం తనకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని ఆయన తెలిపారు. తోట పూర్తిస్థాయి దిగుబడికి వచ్చే వరకు అంతర పంటల ద్వారా కూడా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.ప్రస్తుతం ఆయిల్‌పామ్ ధర రూ.24,025 మెట్రిక్ టన్నుకు చేరడం రైతులకు మరింత ప్రోత్సాహకరంగా ఉందని తెలిపారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి,సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :**
ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరంగా, సమర్థవంతంగా అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయాల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.ప్రజలకు అవసరమైన సమాచారం, సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, ప్రజల సమస్యలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, సంబంధిత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ పునర్నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యం

## -బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

## -మంథని కార్యకర్తల పాద యాత్రకు దాసరి ఉష సంఘీభావం

**పెద్దపల్లి,సెప్టెంబర్ 29(జనంసాక్షి) :**
కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని,మంథనిలో పుట్ట మధు శాసనసభ్యునిగా విజయం సాధించాలని బలమైన సంకల్పంతో మంథని నుంచి గజ్వేల్‌లోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం వరకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,ఉద్యమకారులు బుర్ల వెంకటేష్,కొండ వెంకటేష్,బెన్నీ పాల్ చేపట్టిన పాదయాత్ర సోమవారం రాత్రి పెద్దపల్లికి చేరుకోగా,బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష వారికి ఘనంగా స్వాగతం పలికి పూర్తి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ 2.0 పునర్నిర్మాణం,రాష్ట్ర సంక్షేమం,ప్రగతి సాధ్యమవుతాయని,మంథని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పుట్ట మధు నాయకత్వం ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు.ప్రజా క్షేత్రంలో వారిద్దరి విజయాలను ఆకాంక్షిస్తూ సుమారు 200 కిలోమీటర్ల మేర ఎక్కడా ఆగకుండా కార్యకర్తలు ఇంతటి కఠినమైన పాదయాత్రను చేపట్టడం వారి అంకితభావానికి,పార్టీపై ఉన్న తిరుగులేని నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.పాదయాత్ర చేపట్టిన కార్యకర్తలకు రాత్రి పెద్దపల్లిలో బస,వసతి ఏర్పాట్లు చేసి, అనంతరం ఎర్రవల్లి వైపు ప్రయాణాన్ని కొనసాగిస్తుండగా వారికి దాసరి ఉష సాదరంగా వీడ్కోలు పలికి యాత్ర విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భిక్షపతి,ఓదెలు,అబ్దుల్ మాలిక్,కన్నం శ్రవణ్,సిద్దు,ఎండీ అజీమ్,శ్రీను,చరణ్ తేజ్,రజనీకాంత్,తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత పోలీస్ శిక్షణకు సమన్వయ కమిటీఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 29:** పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన అకాడమీ ఆఫ్ సక్సెస్ అండ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. అకాడమీ ఇన్‌చార్జ్ ఫరాజ్ మొహియుద్దీన్, సంయుక్త కార్యదర్శి ఖాలిద్ బా వజీర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామగుండం కమిషనరేట్ సమన్వయకర్తగా ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ వ్యవహరించనుండగా, కన్వీనర్‌గా మసూద్ అహ్మద్ ఖాన్, సహ కన్వీనర్‌గా ఫయ్యాజుద్దీన్ బాధ్యతలు చేపట్టనున్నారు. కమిటీ సభ్యులుగా అక్బర్ (జేఐహెచ్), మజహరుద్దీన్ (ఐవైఎం), ఫాజిల్ అహ్మద్ ఖాన్ (ఎస్ఐఓ), ఖాజా మిస్బాహుద్దీన్ (నాయకుడు), మక్బూల్ హుస్సేన్ (సామాజిక కార్యకర్త) వ్యవహరించనున్నారు. రాత పరీక్షతో పాటు శారీరక సామర్థ్య పరీక్ష శిక్షణఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్షకు సంబంధించిన అంశాలతో పాటు శారీరక సామర్థ్య పరీక్షలో ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. అభ్యాస సామగ్రి, నిపుణులైన అధ్యాపకుల ద్వారా మార్గదర్శకత్వం కల్పించడంతో పాటు అభ్యర్థుల ఎంపిక కోసం వడపోత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు యువతను సిద్ధం చేయడం, విద్యా, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.






## కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో (పి టి ఆర్) సామర్థ్యం పెంపు

### 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంపుతో

### మెరుగుపడనున్న విద్యుత్ సరఫరా

**గంభీరావుపేట, సెప్టెంబర్ 29 (జనం సాక్షి):** గంభీరావుపేట సెక్షన్, సిరిసిల్ల డివిజన్ పరిధిలోని కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 8 ఎంవీఏకు పెంచారు. ఇప్పటికే ఉన్న 8 ఎంవీఏ కు అదనంగా ఈ సామర్థ్య పెంపు చేపట్టారు. ఈ కార్యక్రమం సిరిసిల్ల ఎస్సీ/ఓపి /డి ఈతో పాటు ప్రొటెక్షన్, టిఆర్ఈ, ఆపరేషన్ విభాగాల ఏడీలులు, ఏ ఈ సమక్షంలో నిర్వహించారు. పి టి ఆర్ సామర్థ్యం పెంపుతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడి, సరఫరా విశ్వసనీయత పెరగనుంది. పెరుగుతున్న విద్యుత్ లోడ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ చర్య దోహదపడనుంది.

# వర్గ పోరాటాలతోనే కుల వ్యవస్థను కూల్చాలి

**సిరికొండ, సెప్టెంబర్ 29 (జనం సాక్షి ):** కుల వ్యవస్థ నిర్మూలనకు వర్గ పోరాటాలను బలోపేతం చేయాలని అఖిల భారత ఐక్యరైతుసంఘం (ఎఐకెఎ) రాష్ట్ర అధ్యక్షుడు వి. ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిరికొండ మండలం గడ్కోల్‌లో పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావానికి 154 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కుల నిర్మూలన సదస్సు నిర్వహించారు.సదస్సులో సీకేఎంఎల్ (మాస్‌లైన్) ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే. గౌస్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే 1873లో సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని వివరించారు. సావిత్రిబాయి పూలే విద్య ద్వారా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. పెరియార్ స్వాభిమాన ఉద్యమం ద్వారా కుల ఆధిపత్యం, మూఢనమ్మకాలపై పోరాటం సాగించారని పేర్కొన్నారు.కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతల నిర్మూలనకు గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు, ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సదస్సు పిలుపునిచ్చింది. విద్య, ఉపాధి, భూమి, ప్రజా వనరులపై సమాన హక్కుల కోసం ప్రజలను ఐక్యం చేసి సామాజిక న్యాయం సాధించే దిశగా కార్యాచరణ కొనసాగించాలని కోరింది.కార్యక్రమంలో పి. రామకృష్ణ, బి. దేవారం, ఆర్. రమేష్, ఎం. లింబాద్రి, కె. రాజేశ్వర్, బి. బాబన్న, పి. రామ, ఈ. జమున, ఆర్. పుష్పలత, బి. లావణ్య, ఎస్. గంగామణి, ఎం. అనీస్, ఎస్. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# పారమిత వరల్డ్ స్కూల్ లో విద్యార్థులకు ఆత్మరక్షణ పై అవగాహన

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 29 (జనంసాక్షి) :** స్థానిక అల్గునూర్ లోని పారమిత వరల్డ్ స్కూల్ లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్ కుమార్ నేతృత్వంలో మంగళవారం రోజు ఆత్మరక్షణ పై అవగాహన కార్యక్రమం, కరాటే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
విద్యార్థులు కరాటేలోని కటా, స్పారింగ్, ఆత్మరక్షణ పద్ధతులను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వివిధ స్థాయిల బెల్ట్‌లను సాధించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్ మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతోపాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. కరాటే సాధన శారీరక దారుఢ్యంతోపాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఏకాగ్రత, ధైర్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని సూచించారు. బెల్ట్‌లు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, వి.యూ.ఎం ప్రసాద్, కరాటే ఇన్‌స్ట్రక్టర్లు మొయినుద్దీన్, రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు..

### గన్నేరువరంలో బీజేపీ ఆందోళన, సీఎం దిష్టిబొమ్మ దహనం

**గన్నేరువరం, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** ఢిల్లీలో జరిగిన 'ఇండియాస్ నెక్ట్స్ చాప్టర్' కాంక్లేవ్ లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.''పేదోళ్లకు శివుడు.. ఉన్నోళ్లకు రాముడు.. అందుకే బీజేపీ వాళ్లు పదే పదే 'జై శ్రీరామ్' అంటారు'' అని సీఎం చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం గన్నేరువరం మండల కేంద్రంలో బీజేపీ ఆందోళన చేపట్టింది. మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా నికేష్ మాట్లాడుతూ, హిందూ దేవుళ్ల మధ్య విభేదాలు సృష్టించే విధంగా సీఎం మాట్లాడడం సరికాదన్నారు. దేవుళ్లలో పేద, ధనిక అనే తేడా ఉండదని, రాజకీయ అవసరాల కోసం శైవ, వైష్ణవ దేవుళ్ల మధ్య అడ్డుగోడ పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం వెంటనే తన మాటలను వెనక్కి తీసుకుని హిందూ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, సీనియర్ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పుల్లెల రాము, నాయకులు మచ్చ బాలరాజు, మునిగంటి సత్తయ్య, మునిగంటి లింగయ్య, సాయి గణేష్, పుల్లెల జగన్మోహన్, సందవేణి ప్రశాంత్, కుర్ర హరీష్, నల్ల జైపాల్ రెడ్డి, గడ్డం రమణారెడ్డి, సింగిరెడ్డి లచ్చిరెడ్డి, పత్తి రాజు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూనియర్ న్యాయవాదులకు అండగా ప్రభుత్వం నిలవాలి

### నెలవారీ స్టైపెండ్, ఆరోగ్య బీమా కల్పించాలి..

### న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్



**జగిత్యాల(సెప్టెంబర్ 29) జనం సాక్షి:** న్యాయవృత్తిలోకి అడుగుపెడుతున్న జూనియర్ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ కుల సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్ డిమాండ్ చేశారు. ప్రాక్టీస్ ప్రారంభించిన తొలి దశలో ఆదాయం లేకపోవడంతో అనేకమంది యువ న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జూనియర్ న్యాయవాదులకు నెలవారీ గౌరవ వేతనం, ఆరోగ్య బీమా, వృత్తిపరమైన శిక్షణ అందించేలా ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని కోరారు.న్యాయవృత్తిలోకి వచ్చే యువతకు ప్రభుత్వం అండగా నిలిస్తేనే న్యాయవ్యవస్థలో సామాజిక ప్రాతినిధ్యం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే జూనియర్ న్యాయవాదులకు ప్రత్యేక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఉచిత గుండె పరీక్షలతో ప్రపంచ హృదయ దినోత్సవం




కరీంనగర్, క్రైమ్ సెప్టెంబర్ 29 ( జనంసాక్షి ) : లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, డిస్ట్రిక్ట్ 320జి , ఆధ్వర్యంలో ఆదర్శ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని మంగళవారం కరీంనగర్ ముకురంపురలోని ఆదర్శ హాస్పిటల్‌లో నిర్వహించారు.గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, గుండె సంబంధిత వ్యాధులను నివారించడం, అలాగే హృదయ సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి లయన్ మోర బద్రేశం డిస్ట్రిక్ట్ గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డా. అరుణ్ కటారి కార్యక్రమానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు.ప్రత్యేక హార్ట్ హెల్త్ ప్యాకేజ్‌లో భాగంగా పాల్గొన్న వారికి ఉచిత షుగర్ టెస్ట్, ఈసీజీ మరియు 2డి ఎకో ప్రత్యేక ప్యాకేజ్ సేవలు అందించారు. డా. గోవింద్ ఝాదవ్, సీనియర్ కార్డియాలజిస్ట్, గుండె ఆరోగ్యం, నివారణ చర్యలు మరియు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై విలువైన సూచనలు అందించారు.సమాజానికి వైద్య సేవలందిస్తున్న వైద్యులు మరియు వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా సత్కరించారు అలాగే ఆదర్శ హాస్పిటల్ బృందం డిస్ట్రిక్ట్ గవర్నర్‌ను సత్కరించింది.క్లబ్ ప్రెసిడెంట్ లయన్ మైడం శివకాంత్ పటేల్ తో పాటు బట్టు వినోద్, మెతుకు కృష్ణ చైతన్య, ముక్క శరత్ కృష్ణ, ఐతా సూరజ్, సింగమరాజు, సనా వేణు మరియు గుడిసె రాజేంద్ర ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు తమ సహకారం అందించారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, గుండె సంబంధిత ప్రమాద కారకాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన గుండె ఆరోగ్యాన్ని సాధించవచ్చని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్యులు, ఆదర్శ హాస్పిటల్ యాజమాన్యం, లయన్స్ సభ్యులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సమాజ సేవలో భాగంగా ప్రజా ఆరోగ్యం మరియు సంక్షేమానికి సంబంధించిన అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ముందుకు సాగుతుంది.



# హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**○సిరిసిల్లలో భూముల వివరాలపై స్పష్టత ఇవ్వాలి**

**○సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ నాయకులు**



**ముస్తాబాద్ సెప్టెంబర్ 29( జనంసాక్షి)** సిరిసిల్లలో నిర్వహించనున్న సభలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్పష్టమైన ప్రకటన చేయాలని ముస్తాబాద్ మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు నాయకులు డిమాండ్ చేశారు.ముస్తాబాద్ బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ.తులం బంగారం ఎక్కడపెన్షన్ ఎక్కడ.రైతు భరోసా ఎక్కడఉద్యోగాలు ఎక్కడవికలాంగులకు స్కూటీలు ఎక్కడమహిళలకు నెలకు 2,500 ఎక్కడఆటో కార్మికులకు ఇచ్చే సాయం ఎప్పుడుఅని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, అమలు చేసిన హామీలు, ఇంకా అమలు చేయాల్సిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కరెంట్ సమస్యలతో పంటలు ఎండిపోతుంటే రైతు పొలంలో కన్నీళ్లు పెడుతున్నాడు. నీళ్లు లేక బోర్లు ఎండిపోతున్నాయి. పంటలు చేతికందక ముందే నష్టపోతున్న రైతు రోడ్డెక్కుతున్నాడు. కానీ ప్రభుత్వం మాత్రం సభల ఏర్పాట్లలో బిజీగా ఉందని విమర్శించారు. గురుకులాల్లో విద్యార్థుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకు పంపాలా? భయ పడాలా? అనే పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న యువతకు నోటిఫికేషన్లు, ఉద్యోగ నియామకాలపై స్పష్టత కావాలన్నారు.పీఆర్సీ, డీఏల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని, వారి సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఒకవైపు రైతు కన్నీరు.మరోవైపు నిరుద్యోగి ఆవేదన.ఇంకోవైపు ఉద్యోగి నిరీక్షణ?ఇన్ని వర్గాల సమస్యలు ఉన్న సమయంలో ప్రభుత్వం ఏ దిశగా వెళ్తోందని ప్రశ్నించారు.ప్రజల ఇళ్లలో చీకటి ఉంటే ప్రభుత్వ సభా వేదికల వెలుగులు ఎందుకు? రైతు పొలంలో నీరు లేకపోతే రాజకీయ సభలకు ఇన్ని ఏర్పాట్లు ఎందుకుయువత చేతిలో ఉద్యోగ నియామక పత్రం లేకపోతే అధికార పార్టీ చేతిలో ప్రచార పత్రాలు ఎందుకు.ఉద్యోగులు జీతం, డీఏ, పీఆర్సీ కోసం ఎదురుచూస్తుంటే పాలకులకు రాజకీయ సభలే ప్రాధాన్యమా? అని ప్రశ్నించారు.ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు ఇవే మా కరెంట్ ఎక్కడ. మా నీళ్లు ఎక్కడ మా ఉద్యోగాలు ఎక్కడ. మా పిల్లల భద్రత ఎక్కడ మా ఉద్యోగులకు న్యాయం ఎక్కడ మా హామీల అమలు ఎక్కడ.ప్రజల కన్నీళ్లకు సమాధానం సభలు కావు? పరిష్కారాలు కావాలి.ప్రజల సమస్యలకు సమాధానం మైకులు కాదు చేతల్లో కనిపించే పాలన కావాలి.తెలంగాణను పాలించాల్సిన వారు తెలంగాణ సమస్యలపై దృష్టి పెట్టకుండా సిరిసిల్ల సభకు ప్రాధాన్యత ఇస్తే.ఎటు పోతోంది తెలంగాణ? ఎవరి కోసం నడుస్తోంది ఈ ప్రభుత్వం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఏద్దండీ నర్సింహా రెడ్డి అన్నారు. సమస్యలు గాలికి? సభకు 4 మంత్రులు, 15 మంది ఎమ్మెల్యేలు, 2ఎమ్మెల్సీలు ఎందుకుప్రజల సమస్యలపై కూడా ఇదే స్థాయిలో దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో , పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు రాచమడుగు సంతోష్ రావు, మాజీ ఉప సర్పంచ్ కొండా శ్రీనివాస్ గౌడ్, ఃపార్టీ నాయకులు ఆనంద్ రావు చెవుల మల్లేశం యాదవ్ మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షుడు, శీలం స్వామి,మాజీ మండల కో అప్షన్ మెంబర్ అన్వర్, తాళ్ల రాజు,మాజీ ఎంపీటీసీ పడిగే ఆంజనేయులు,కంచం నర్సింలు,వార్డు మెంబర్లు గౌండయ్య, శీలం పద్మ వెంకటేష్, పార్టీ నాయకులు ముక్క మల్లయ్య పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ను తొలగించాలి

**ఎడపల్లి మహాజన సభలో రైతుల తీర్మానం**




ఎడపల్లి, సెప్టెంబర్ 29 ( జనంసాక్షి ) : యూరియా యాప్ ను తొలగించి పాత పద్ధతిలోనే ఎరువులను సరఫరా చేయాలని ఎడపల్లి మహాజన సభలో రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మంగళవారం ఎడపల్లి సహకార సంఘం మహాజన సభ సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 2025-26 సంవత్సరం వార్షిక నివేదికను, జమా ఖర్చులను సహకార సంఘం కార్యదర్శి రాజారాం చదివి వినిపించారు. సంఘ ఇంచార్జి సెక్రటరీ చదివి వినిపించారు. 2025-26 వార్షిక నివేదిక, అడిట్ రిపోర్ట్ ఆమోదం తెలపడంతో పాటు యూరియా యాప్ ను తొలగించి పాత పద్ధతిలోనే ఎరువులను సరఫరా చేయాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సహకార సంఘ చైర్మన్ పోల మల్కారెడ్డి మాట్లాడుతూ, నష్టాల్లో బాటలో ఉన్న ఎడపల్లి సహకార సంఘంలో నేడు లాభాల బాటలో పయనించే విధంగా పాలకవర్గం సమిష్టి కృషితో సాధ్యపడిందన్నారు. అయితే కొంతమంది ఎడపల్లి సహకార సంఘంపై బురద చల్లే విధంగా లేనిపోని ఆరోపణ చేయడం సమంజసం కాదన్నారు. ఎడపల్లి సహకార సంఘంలో ఎలాంటి అవినీతికి చోటు లేదని అయితే సేల్స్ మెన్లు చేసిన తప్పిదానికి అధికారులు విచారణ చేపట్టడం జరిగిందన్నారు. విచారణలో దోషులు తేలితే చర్యలు తప్పవని ఈ విషయంలో ఎలాంటి రాజీలేదని, సంఘంలో 59 లక్షల డిపాజిట్ ఉందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని చైర్మన్ పోల మల్కా రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు బర్దిపూర్ ప్రవీణ్, మొద్దోళ్ళ సురేష్, సబావత్ రాములు, కే లక్ష్మి, కొప్పుల రాములు, కే పరశురాం గౌడ్, టీ కృష్ణారెడ్డి, పరిగే సుమన్, చె?పూర్ నాగేష్ గౌడ్ తో పాటు గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్, గ్రామ పెద్దలు ఆకుల శ్రీనివాస్, బంజ కామప్ప, బంజ శంకర్, మాణిక్ ఎల్లయ్య యాదవ్, పాల్ద భాస్కర్ రెడ్డి, భారీ, మల్లెపూల శ్రీనివాస్, గుంజరీ రెడ్డి, పడిదం కృష్ణారెడ్డి, రైతులు, సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## భవిత విద్యార్థులకు మండల స్థాయి పోటీలు

**విద్యార్థులను అభినందించిన డీఈవో**

**ఎడపల్లి, సెప్టెంబర్ 29 ( జనంసాక్షి ) :**

మేడిపల్లి మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు మండస్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈఆర్టి రాజేష్ కులకర్ణి ఆధ్వర్యంలో భవిత కేంద్రంలోని విద్యార్థులకు ప్రత్యేక వాలీబాల్, హిట్ ద టార్గెట్ గేమ్, రింగ్ టాస్ పోటీలను నిర్వహించారు. ఈ మేరకు కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అయితే తమ అంగవైకల్యం అడ్డుగా రాదు అని ఆత్మవిశ్వాసంతో విద్యార్థిని విద్యార్థులు ముందుకు సాగుతూ తమ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మండల విద్యాధికారి గాలప్ప, ఈఆర్టి రాజేష్ కులకర్ణి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల నియోజకవర్గాన్ని సీఎం దత్తత తీసుకోవాలి

**అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి**

**టీజేఏసీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ మజహార్**

**గంభీరావుపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ మజహార్ కోరారు. మంగళవారం గంభీరావుపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 ఎన్నికల సమయంలో సిరిసిల్ల జిల్లా ఏర్పాటు కోసం సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఉద్యమానికి మద్దతు తెలిపారని గుర్తుచేశారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని ఎన్నికల సభలో హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నందున ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అప్పర్ మానేరు, కాళేశ్వరం 9వ ప్యాకేజీతో పాటు సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. సిరిసిల్ల పట్టణంలో వర్షం పడిన ప్రతిసారీ ఏర్పడుతున్న వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా ప్రజలకు అందుతున్నాయని అన్నారు. పద్మశాలీల కోసం రూ.50 కోట్లతో యారన్ డిపో మంజూరు చేయడం, చేనేత కార్మికుల రుణమాఫీ వంటి చర్యలను స్వాగతిస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల సమగ్ర అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలని అబ్దుల్ మజహార్ కోరారు.

## జగిత్యాల పట్టణ టి ఆర్ నగర్ లో ఓర్సు దినోత్సవం

**ముస్లిం మైనార్టీల ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 29 (జనంసాక్షి)**




జగిత్యాల పట్టణంలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఓర్సు దినోత్సవం కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, ఐకమత్యంతో పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు.టి ఆర్ నగరాల్లో నిరుపేదలకు ఊా 59 కింద 116 మందికి పట్టాలు ఇవ్వడం జరిగింది అన్నారు.దాదాపు 200మందికి డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు చేయటం జరిగింది అన్నారు.టి ఆర్ నగర్ అభివృద్ది కి కట్టుబడి ఉన్నా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వం అన్నారు.నిరంతరం పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి అభివృద్ది కి కృషి చేస్తా అన్నారు. శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవంతో జగిత్యాల మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆఃఇః అధ్యక్షులు గజంగి నందయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ కౌన్సిలర్ లు చాంద్ పాషా, లావణ్య రాజేందర్ ,పద్మ రాజేందర్, స్వప్న గిరిధర్, పవిత్ర మహేష్ ,మమత రామకృష్ణ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు జెల్ల రవీందర్ ,ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సద్దాం హుస్సేన్, కోటగిరి మోహన్,మెన్నెనీ ప్రవీణ్ రావు,ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలపై ఉన్నతస్థాయి సమీక్ష

## దసరాలోపు 12 కీలక అంశాలపై నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి హామీ

## ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్

**యైటింక్లైన్ కాలనీ(జనంసాక్షి), సెప్టెంబర్ 29:** సింగరేణి కార్మికుల సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ తెలిపారు. సమీక్ష సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేమ్ సాగర్‌రావు, గండ్ర సత్యనారాయణరావు, గడ్డం వినోద్, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరెం కనకయ్య తదితరులు పాల్గొన్నారు. సింగరేణి యాజమాన్యం తరపున సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు, డైరెక్టర్లు కొప్పుల వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, తిరుమలరావు, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 35 శాతం లాభాల వాటాను దసరాలోపు కార్మికుల ఖాతాల్లో జమ చేయడం, కారుణ్య నియామకాలు, ప్రతి నెలా మెడికల్ బోర్డుల నిర్వహణ, సొంత ఇంటి పథకం, పెర్క్స్‌పై పన్ను మినహాయింపు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తిరుపతి యాదవ్ తెలిపారు. అలియాస్ నేమ్స్ సమస్యను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించడం, పెండింగ్ కోర్టు/విజిలెన్స్ కేసులు, కొత్త బొగ్గు గనుల కేటాయింపు, జెన్‌కో/ట్రాన్స్‌కో బకాయిలు, 33 మంది వైద్యుల నియామకం తదితర మొత్తం 12 కీలక అంశాలపై దసరాలోపు నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన వివరించారు.



**ఆర్జీ-3 ఓసీ-1లో గేట్ మీటింగ్**

సమీక్ష సమావేశంలో వచ్చిన సానుకూల స్పందన, ప్రభుత్వ హామీలను కార్మికులకు వివరించేందుకు మంగళవారం ఉదయం సింగరేణి ఆర్జీ-3, ఓసీ-1 గని ఆపరేషన్ సైట్ ఆఫీస్ వద్ద ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఐఎన్టీయూసీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఐఎన్టీయూసీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గని ఐఎన్టీయూసీ పిట్ కార్యదర్శి ప్రవీణ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సారయ్య, నరేష్‌కుమార్, వినయ్, సతీష్, రంగా దిలీప్, చిట్టబోయిన శ్రీనివాస్, కనకయ్య, జహీర్, సమ్మయ్య, ఆనంద్, గంధం శ్రీనివాస్, నాగరాజు, రవీందర్, రాజన్న, రఘుతో పాటు ఆర్జీ-3 ఓసీ-1 కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీఎం వ్యాఖ్యలను నిరూపించాలి

## సిరిసిల్లకు ఏం చేస్తారో సభలో స్పష్టం చేయాలి

## బీఆర్ఎస్ నాయకుల డిమాండ్..

**గంభీరావుపేట, సెప్టెంబర్ 29 (జనం సాక్షి):** గంభీరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దమ్మన్నపేట సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, కొల్లమద్ది సర్పంచ్ దిలీప్, వెంకట స్వామి గౌడ్ ,సెస్ నారాయణరావు, జి.రాజు తదితరులు మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆధారాలతో నిరూపించాలని, లేనిపక్షంలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్ల నియోజకవర్గానికి ఇప్పటివరకు ఏం చేసిందో ప్రజలకు వివరించాలని కోరారు. నేడు సిరిసిల్లలో జరగనున్న సీఎం సభలో నియోజకవర్గానికి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, నిధులపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రభుత్వం ఏం చేయబోతోందో ముందుగానే వెల్లడించాలని అన్నారు. తమ నాయకులపై సీఎం చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



# వృద్ధాశ్రమంలో బీజేపీ సేవా కార్యక్రమం

## వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## కందుల సంధ్యారాణి

**యైటింక్లైన్ కాలనీ(జనంసాక్షి), సెప్టెంబర్ 29:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న "సేవా సంకల్పం" కార్యక్రమాల్లో భాగంగా వీర్లపల్లిలోని ఈశ్వర కృపా వృద్ధాశ్రమంలో బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమంలోని వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వృద్ధులకు స్వయంగా భోజనాలను వడ్డించి, వారితో కలిసి కొంత సమయం ఆప్యాయంగా గడిపారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, నరేంద్ర మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా "సేవా సంకల్పం"గా నిర్వహిస్తూ సమాజంలోని వివిధ వర్గాలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వృద్ధులను గౌరవించడం, వారికి ఆప్యాయతను అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలోని వృద్ధులతో ముచ్చటించి వారి అవసరాలను తెలుసుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని కందుల సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 8వ కాలనీ బీజేపీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు మూకిరి రాజు, కందుల పోచం, ఆకుల కుమార్ గౌడ్, లింగం నాయక్, జంజర్ల శ్రీనివాస్, కండే సాగర్, ఐలవేని అనిల్ కుమార్, జక్కన బాలు, ఏరుకొండ తిరుపతి, బూడిద హర్ష, అంగలి సంతోష్ తదితరులతో పాటు వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

# యంత్రాలు లేకుండా ఉత్పత్తి ఎలా సాధ్యం?

## కార్మికులపై నిందలు మోపడం ఆపాలి : సీఐటీయూ



**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి), సెప్టెంబర్ 29:**

రామగుండం-2 ఏరియాలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో నెలకొన్న డోజర్ల కొరత, యంత్రాల మరమ్మతుల్లో జాప్యం, అవసరమైన స్పేర్ పార్ట్స్ అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. సమస్యలను పరిష్కరించకుండా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల పేరుతో కార్మికులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ప్రాజెక్టు మేనేజర్ ద్వారా రామగుండం-2 ఏరియా జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, అవసరమైన యంత్రాలు అందుబాటులో లేకుండా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. ప్యానెల్ ఏరియాలు, ఫేసులు, హాల్ రోడ్లు, డంప్ యార్డుల్లో అవసరమైన డోజర్లు అందుబాటులో లేకపోవడంతో బొగ్గు ఉత్పత్తి, లోడింగ్, మట్టి తరలింపు పనులకు తరచూ తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. కొత్త యంత్రాలను సమకూర్చడంతో పాటు అందుబాటులో ఉన్న యంత్రాలకు సకాలంలో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. యంత్రాల వైఫల్యాలు, నిర్వహణ లోపాల కారణంగా ఉత్పత్తి తగ్గుతున్న పరిస్థితుల్లో కార్మికులే కారణమన్నట్లుగా చిత్రీకరించడం సరికాదని ఆయన అన్నారు.

**శాస్త్రీయ బ్లాస్టింగ్‌పై దృష్టి పెట్టాలి**

శాస్త్రీయ పద్ధతిలో బ్లాస్టింగ్ చేపట్టకపోవడం వల్ల పెద్ద బండరాళ్లు ఏర్పడి లోడింగ్ పనులకు ఆలస్యం జరుగుతోందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. దీంతో యంత్రాలపై అదనపు భారం పడటంతో అవి దెబ్బతిని రోజుల తరబడి బ్రేక్‌డౌన్‌కు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. డోజర్లకు అవసరమైన స్పేర్ పార్ట్స్‌ను అందుబాటులో ఉంచడంతో పాటు ఏసీ సదుపాయంతో కూడిన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రివెంటివ్ మెయింటెనెన్స్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

**కార్మికులకు భద్రతా సదుపాయాలు కల్పించాలి**

సింగరేణి సంస్థను కాపాడేది కేవలం ఉత్పత్తి లక్ష్యాలు, గణాంకాలు మాత్రమే కాదని, కార్మికుల శ్రమకు తగిన యంత్రాలు, భద్రతా సదుపాయాలు కల్పించడం కూడా యాజమాన్యం బాధ్యత అని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. కార్మికులు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ అవసరమైన యంత్రాలు అందుబాటులో లేకపోతే ఉత్పత్తి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

యంత్రాల వైఫల్యాలను కప్పిపుచ్చి కార్మికులపై నిందలు వేయకుండా, ఉత్పత్తికి అవసరమైన సౌకర్యాలను కల్పించి బాధ్యతాయుతంగా పనిచేసే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. యంత్రాల కొరతను తక్షణమే పరిష్కరించి సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పిట్ సెక్రెటరీ రాంప్రసాద్, అసిస్టెంట్ సెక్రటరీ వినేష్, శివకుమార్, రాజేందర్, తిరుపతి, సంతోష్‌తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం - రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ దుష్ప్రచారం

## డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులకు, దేశ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా ఏదో ఒక పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ని అభిశంసించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయడం అత్యంత హేయమైన చర్య అని, సుదీర్ఘకాలం పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ, ఇలాంటి ఆధారరహిత ఆరోపణలు చేస్తూ, వ్యవస్థల ప్రతిష్టను దిగజారుస్తోందన్నారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ 2025 ఫిబ్రవరి నెలలోనే బాధ్యతలు స్వీకరించగా, అంతకుముందు జరిగిన అనేక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించిన సత్యాన్ని కాంగ్రెస్ విస్మరిస్తోందన్నారు. దేశ ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ సమర్ధవంత మైన నాయకత్వాన్ని విశ్వసించి బిజెపిని నిరంతరం ఆదరిస్తున్నారు. గతంలో ఎన్నికల్లో ఓటమికి ఈవీఎంలే కారణమని ప్రచారం చేసిన కాంగ్రెస్, ప్రజలు ఆ మాటలను నమ్మకపోవడంతో ఇప్పుడు స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రక్రియపై బురదజల్లే యత్నం చేస్తోంది. చట్టబద్ధంగా ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించాల్సిన ఎస్ఎస్ఆర్ ప్రక్రియను రాజ్యాంగబద్ధంగా ఎన్నికల కమిషన్ చేపడుతోంది. ఎన్నికల కమిషన్‌లో ఉన్న ముగ్గురు కమిషనర్లు సమావేశమై, సుదీర్ఘంగా చర్చించిన పిమ్మట ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించి ఈ ప్రక్రియను అమలు చేస్తున్నారు. ఎస్ఎస్ఆర్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, తమిళనాడులోనూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఒకవేళ కమిషన్ బిజెపికి సహకరిస్తే ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు ఎలా గెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ తన హయాంలో ఎన్నికల కమిషన్‌ను, రాజ్యాంగ పదవులను స్వప్రయోజనాల కోసం ఏ విధంగా వాడుకుందో దేశ ప్రజలకు స్పష్టంగా తెలుసు. గతంలో సిఇసిగా పనిచేసిన ఎం.ఎస్. గిల్ వంటి అధికారులను తమ పార్టీలో చేర్చుకుని, ఆ తదనంతరం వారికి ఎంపీ, కేంద్ర మంత్రి పదవులు కట్టబెట్టి ప్రోత్సహించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. బిజెపి ఎన్నడూ రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేయలేదని, ఆ సంస్కృతి బిజెపికి లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఓటర్లను నేరుగా కలిసి, పత్రాలను పరిశీలించిన తర్వాతే ఓటర్ల జాబితా నమోదు, సవరణలు చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కాశీ విశ్వనాథ్ ధామ్‌ను పునర్నిర్మించి, హిందూ ధర్మ విశ్వాసాలను, ఆలయ వైభవాన్ని పునరుద్ధరించిన ఘనత బిజెపి ప్రభుత్వానికే దక్కుతుంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని కుట్రలు, చౌకబారు వ్యూహాలు పన్నినా ప్రజలు నరేంద్ర మోదీ వైపే ఉన్నారని, రాబోయే రోజుల్లో బిజెపికే మద్దతు తెలుపుతారని యాదగిరి సునీల్ రావు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి పార్టీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, బండారి వేణు, బండ రమణా రెడ్డి, మేకల వెంకటేష్, భూపతి రవీందర్, రామన్, నాంపల్లి శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, దేవసాని సత్యనారాయణ, సర్దార్ బల్విందర్ సింగ్, మహమ్మద్ ముజీబ్, పండుగ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్ గౌడ సంఘం అధ్యక్షులుగా పైడిపల్లి రవీందర్ గౌడ్ ఉపాధ్యక్షులుగా అనగోని రాజు ఏకగ్రీవ ఎన్నిక



**సైదాపూర్ సెప్టెంబర్ 29 (జనంసాక్షి)** సైదాపూర్ మండలంలో నిర్వహించిన గౌడ సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకున్నారు ఈ సమావేశంలో నూతన అధ్యక్షులుగా పైడిపల్లి రవీందర్ గౌడ్ ఉపాధ్యక్షులుగా అనగోని రాజు గౌడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు పాలకవర్గం దొనికెన రమేష్ అనగోని వీరన్న అనగోని ప్రణయ్ అనగోని సుదర్శన్ అనగోని కార్తీ కొండ మల్లయ్య కోలుపాక తిరుపతి లు నియమితులయ్యా ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన కుల బంధువులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు మన గౌడ కులస్తుల హక్కుల సాధనకై కుల సంఘం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని అలాగే అందర్నీ కలుపుకొని సంఘాన్ని ముందుకు తీసుకెళ్తానని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు పెద్దలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి ఘనంగా సత్కరించారు.

## బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**బోధన్, సెప్టెంబర్ 29 ( జనంసాక్షి ) :** ప్రజా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందించడమే లక్ష్యమని బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పారిశుధ్యం, మౌలిక వసతులపై వైద్యులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు విన్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఆసుపత్రిలో మెరుగుపరచాల్సిన వసతులపై ప్రభుత్వం తరపున తక్షణ చర్యలు తీసుకుని నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఎఎఊఈచి) గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డా. కవితా రెడ్డి, బోధన్ ఆర్డీవో విజయ కుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాహుల్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బోధన్, ఎడపల్లిలలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**బోధన్, ఎడపల్లి సెప్టెంబర్ 29 ( జనంసాక్షి ) :** బోధన్ ఎడపల్లిలలో మంగళవారం స్మార్ట్ కార్డులు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. మొదట ఎడపల్లి మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందించారు. అలాగే బోధన్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో తదితరులకు స్మార్ట్ కార్డులు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డిఓ విజయ కుమారి, ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాసరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్ల రామ్మోహన్, మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ మచ్కూర్ గంగాధర్, మైనార్టీ నాయకులు బండారి హబీబ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఫరాన్, నవీన్, కట్కం సాయిలు, జాన్కంపేట్ సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, బొబ్బిలి శ్రీనివాస్, తాసిల్దార్ దత్తాద్రి, డిప్యూటీ తాసిల్దార్ అనూష, బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకు దాము, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, పాషా, పట్టణంలోని కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## సీఎం సభను విజయవంతం చేయాలి..

### కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ పిలుపు..

**గంభీరావుపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** గంభీరావుపేట మండలంలోని షాదీఖానాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మల తిరుపతిగౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల లో జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ పిలుపునిచ్చారు. పార్టీలో విభేదాలకు తావులేకుండా సమిష్టిగా పనిచేసి సభకు భారీగా జన సమీకరణ చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామగ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించాలని నాయకులు కోరారు. మండలం నుంచి భారీగా జన సమీకరణ చేపడుతున్నామని నిమ్మల తిరుపతిగౌడ్ తెలిపారు. సభ విజయవంతానికి గ్రామ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పర్ష హనుమాన్లు, జోగు సురేష్, మాజీ మండల అధ్యక్షులు, కొమ్మిశెట్టి తిరుపతి వివిధ గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ నాయకులు, ఏఎంసీ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ల అభిప్రాయం లేకుండానే ఎజెండా అంశాలు ఆమోదమా..?

- ○మున్సిపల్ కమిషనర్ ను చుట్టుముట్టిన ఎంఐఎం, బిజెపి కౌన్సిలర్లు
- ○ఎజెండా కాపీలను చించివేసిన కౌన్సిలర్లు
- ○వైస్ చైర్మన్ మీర్ ఇలియాస్ అలీ ఆధ్వర్యంలో నిరసనలు
- ○కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు



**బోధన్, సెప్టెంబర్ 29 ( జనంసాక్షి ) :** నిజామాబాద్ జిల్లా బోధన్ మున్సిపల్ సమావేశం మంగళవారం రసాభాసగా సాగింది. అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మరో పార్టీ కౌన్సిలర్లతో కుమ్మక్కై ఎజెండా అంశాలు, ఎంఐఎం బిజెపి కౌన్సిలర్ల అభిప్రాయం లేకుండానే ఆమోదించారని ఆరోపణతో ఎంఐఎం కౌన్సిలర్లు బిజెపి కౌన్సిలర్లు పెద్ద ఎత్తున నిరసన తెలిపి సమావేశం హాలు బయట ఎజెండా అంశాల ప్రజలను చింపివేశారు. నేడు జరిగిన బోధన మున్సిపల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ తూము పద్మ అధ్యక్షతన నిర్వహించారు. అయితే సమావేశంలో 19 ఎజెండా అంశాలను ప్రవేశపెట్టిన అధికారులు వాటిని ఎంఐఎం బిజెపి కౌన్సిలర్లు ఎలాంటి అభిప్రాయం తెలపకుండానే ఆమోదించినట్లు, సమావేశం ముగిసినట్లు ప్రకటించారు. దాంతో ఎంఐఎం కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్ ఇలియాస్ అలీ ఆధ్వర్యంలో ఎంఐఎం కౌన్సిలర్లు బిజెపి కౌన్సిలర్లు సమావేశం హాల్ నుండి బయటకు వచ్చి ఎజెండా కాపిలను చించివేశారు. అలాగే మున్సిపల్ కమిషనర్ బయటకు రావడంతో ఆయనను చుట్టుముట్టి నిలదీశారు. వినాయక చవితి సందర్భంగా చేపట్టిన పనులలో 16 లక్షల సంబంధించిన బిల్లులు ఏకపక్షంగా పెట్టారని ఆరోపించడంతోపాటు మున్సిపల్ కమిషనర్ బాధ్యతారాహితంగా వ్యవహరిస్తూ మున్సిపల్ చైర్మన్ కు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వీరి వల్ల బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని బద్నామ్ అవుతున్నారని అందువల్ల మున్సిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఒంటెద్దు పోకడలతో బోధన్ పట్టణం అభివృద్ధికి నోచుకోవడం లేదని ధనార్జనే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్లు ఆరోపించారు. బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ కౌన్సిలర్లను సముదాయించి పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

# రైతుల శ్రేయస్సే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తాం..

◆ ముల్కనూరు,బొమ్మనపల్లి గ్రామాల్లో ఎరువుల కేంద్రాల ఏర్పాటుకు తీర్మానం..

◆మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గోదాములు,సోలార్ ప్లాంటేషన్, రైస్ మిల్లు నిర్మాణాలకు కృషి..

◆అర్ధవార్షిక మహాసభ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ వెల్లడి..



చిగురుమామిడి సెప్టెంబర్ 29(జనంసాక్షి) :రైతుల శ్రేయస్సే ధ్యేయంగా సహకార సంఘం ద్వారా నిరంతరం పనిచేస్తామని సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ తెలిపారు. చిగురుమామిడి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులు అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యాపారుల దగ్గరికి వెళ్లి ఇబ్బంది పడకుండా,సహకార సంఘాల ద్వారానే రైతులకు అధిక మొత్తంలో లోన్లు ఇవ్వాలని కోరారు.రైతుల పరస్పర సహకారంతోనే సహకార సంఘాల అభివృద్ధి సాధ్యమవుతుందని,రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం మరింత అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని చైర్మన్ రవీందర్ కోరారు.ప్రస్తుతం ఈ సహకార సంఘంలో 3,843మంది సభ్యులు ఉండగా బ్యాంకులో రూ.1,40,44,854నిధులు ఉన్నట్లు వారు వెల్లడించారు.ఈ సంఘం ద్వారా ఇప్పటివరకు 966మంది రైతులకు స్వల్పకాలిక రుణాలు,అలాగే దాదాపు 100మంది రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందించినట్లు వివరించారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముల్కనూరు, బొమ్మనపల్లి గ్రామాలలో కొత్తగా ఎరువుల కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఈ పాలకవర్గ సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక సహకారంతో మండలంలో నూతన గోదాముల నిర్మాణం,సోలార్ ప్లాంటేషన్ ఏర్పాటు,రైస్ మిల్లు నిర్మాణ పనుల కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు రైతులకు ఎరువుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని సమావేశంలో వెల్లడించారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, సంఘం ఇన్చార్జి సీఈఓ చేపూరి కుమారస్వామి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,డిసిసి కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్లు పోటు మల్లారెడ్డి,చాడ మహిపాల్ రెడ్డి,పిల్లి కొమురయ్య,శ్రీరామోజు రాజకుమార్,కుతాటి తిరుపతి,లక్ష్మి, సాయన్న,కనగండ్ల శ్రీనివాస్,బాల్ రెడ్డి, మర్రి శ్రీనివాస్, భాగ్య, పరశు రాములు,సర్పంచులు కాటం సంపత్ రెడ్డి, అలువాల శంకర్,చింతపుల నరేందర్,అల్లెపు సంపత్,సాంబారి భారతమ్మ,సహకార సంఘం అధికారులు రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ అధికారులు అనుమతించిన

## ఎరువులను మాత్రమే విక్రయించాలి

జిల్లా వ్యవసాయ సంచాలకులు నారెడ్ల శ్రీధర్..

**చిగురుమామిడి సెప్టెంబర్ 29(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో నేడు ఎరువుల దుకాణాలను సహాయ వ్యవసాయ సంచాలకులు నరెడ్ల శ్రీధర్ మాట్లాడుతూ,వ్యవసాయ అధికారి అనుమతించిన కంపెనీల ఎరువులను మాత్రమే విక్రయించాల న్నారు.మండల వ్యవసాయ శాఖ అధికారి పొన్నం చందర్ రెడ్డి మాట్లాడుతూ వేరే ఎరువులను విక్రయించడం నిషేధించబడింది,అని దుకాణ యజమానులకు తెలిపారు.యజమానులు కూడా అధికారులకు పూర్తిగా సహకరించి, రైతులకు మంచి నాణ్యమైన ఎరువులు మరియు పురుగుమందులు మాత్రమే అందేలా చూడాలని సూచించారు.ఇలాంటి తనిఖీలు రైతులకు నమ్మకమైన వితరణ వ్యవస్థను కల్పించడానికి నకిలీ లేదా అనుమతించని ఎరువుల విక్రయాన్ని నియంత్రించడానికే భాగమని పేర్కొన్నారు.

## బస్తి దావకాన ,టీహబ్ ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ ఓ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 జనంసాక్షి:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా .బి రాజశ్రీ నిజామాబాద్ పట్టణంలోని మిర్చి కాంపౌండ్ లో గల బస్తి దావకాన, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని టార్గెటివ్ కేర్ మరియు తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్తి దావకాన లో ఔషధారణ స్టాకు రిజిస్టర్, ఔషధాల పంపిణీ రికార్డులను, ఎన్ సి డి స్క్రీనింగ్ రికార్డులను, ఫాలో అప్పు రిజిస్టర్ లను హాజరు పట్టికను రిఫరల్ సర్వీసెస్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఔషధారణ స్టాక్ రిజిస్టర్ పంపిణీ రిజిస్టర్లు ఇతర రికార్డులు అసంపూర్తిగా ఉండరాదని జీవనశైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు 100% పూర్తిచేయాలని, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, దావఖాన కి వచ్చే రోగులతో మర్యాదగా గౌరవంగా ప్రవర్తించాలన్నారు. ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి ఆవరణలోని పాలియేటివ్ కేర్ సెంటర్ ను సందర్శించి నొప్పి నివారణ మందులు అందుబాటులో ఉండాలని, నర్సింగ్ కేర్, స్టాఫ్ డ్యూటీ రోస్టర్ అనుగుణంగా విధులు నిర్వహించాలని, సమయానికి విదులకు హాజరు కావాలన్నారు. అదేవిధంగా తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ శాంపుల్స్ సేకరణ పెంచాలని, ఏజెంట్స్ స్టాక్ పొజిషన్ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ఔషదాలని అందుబాటులో ఉంచాలని, రిపోర్టులను సమయానికి రోగులకు చేరవేయాలని సిబ్బందికి తెలియజేశారు. తనిఖీ సమయంలో బస్తీ దావకాన సిబ్బంది, పాలియేటివ్ కేర్ నందు డాక్టర్ చైతన్య, టీ హబ్ వైద్యురాలు డాక్టర్ దివ్య వైద్య సిబ్బంది ఉన్నారు.





## అన్నదాతలను నిలువునా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

◆రుణమాఫీ, బోనస్, రైతు భరోసా హామీలను గాలికొదిలేసిన రేవంత్ సర్కార్ ◆జిల్లా అధ్యక్షులు, దినేష్ పటేల్ కులాచారి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 జనంసాక్షి:** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతు హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడవ రోజు సైకిల్ యాత్రలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అన్నదాతలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా చిత్తశుద్ధితో అమలు చేయలేదని మండిపడ్డారు. రైతులందరికీ ఏకకాలంలో ?2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అర్ధాంతరంగా చేతులెత్తేశారని, అన్ని రకాల వరి పంటలకు బోనస్ ఇస్తామని నమ్మించి అన్నదాతలను నిలువునా మోసం చేశారన్నారు.రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరానికి విడతకు ?7,500 చొప్పున ఏడాదికి ?15,000 ఇస్తామని ఎన్నికల్లో గొప్పలు చెప్పి, అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. దీంతో ప్రభుత్వం నుంచి ప్రతి రైతుకు దాదాపు ?1,50,000 వరకు రైతు భరోసా బకాయిలు రావాల్సి ఉందని, ఇంత పెద్ద మొత్తంలో అన్నదాతలకు బకాయి పడి మోసం చేయడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.ఇదే క్రమంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న నిరసనలపై స్పందిస్తూ... ఓట్ల తొలగింపు పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు, ధర్నాలు కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికేనని స్పష్టం చేశారు. ఏ ఒక్క అర్హులైన పౌరుడి ఓటును తొలగించడం లేదని, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని కొట్టిపారేశారు.ఈ సైకిల్ యాత్రలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, పద్మా రెడ్డి, శంకర్ రెడ్డి, వెల్మ గంగారెడ్డి, హరీష్ రెడ్డి, చింత శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, గంగాధర్ యాదవ్, దిల్ ధర్, మధు తదితరులు పాల్గొన్నారు.




## సైన్స్ వింగ్ కళాశాలను సీఎం సందర్శించాలి

**విద్యార్థుల సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ**

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 29, (జనంసాక్షి)**

నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి కరీంనగర్కు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైన్స్ వింగ్ కళాశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఆసంపెల్లి వినయ్‌సాగర్ డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన నగర ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరతపై చర్చించారు.ఈ సందర్భంగా వినయ్‌సాగర్ మాట్లాడుతూ సైన్స్ వింగ్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కళాశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం పర్యటన కేవలం కలెక్టరేట్ ప్రారంభోత్సవానికే పరిమితం కాకుండా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలని కోరారు.ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సైన్స్ వింగ్ కళాశాల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు రక్షక్, నగర నాయకులు సాయి, భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి రబ్బి పోటీలకు విద్యార్థుల ఎంపిక



**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్ 14 బాలుర రబ్బి పోటీలకు పెద్ద కొడప్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి. కృష్ణ, బి. ప్రశాంత్ లు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పీడీ సత్యం తెలిపారు. సోమవారం మాచారెడ్డి లో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు తెలిపారు. యువ క్రీడాకారులు కృష్ణ, ప్రశాంత్ లను ప్రధానోపాధ్యాయురాలు కమల, ఉపాధ్యాయ బృందంతో పాటు పలువురు అభినందించారు.

## ముఖ్యమంత్రి ఈ జిల్లాకు ఏం సాధించారని వస్తున్నారు

### బి ఎస్పి అధ్యక్షుడు ఉదయ్



**రుద్రంగి సెప్టెంబర్ 29 (జనంసాక్షి)**

వెయ్యి రోజుల పాలనలో ఏం సాధించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వస్తున్నారు? బహుజన సమాజ్ పార్టీ రుద్రంగి మండల అధ్యక్షుడు దయ్యాల ఉదయ్ ఆధ్వర్యంలో బీఎస్పీ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు కట్కూరి శంకర్ మాట్లాడుతూ, ఈ నెల 30న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2వేల రూపాయల పెన్షన్ ను 4 వేల కు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని, బీసీ డిక్లరేషన్, సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాల హామీ అమలులో విఫలమయ్యారని విమర్శించారు. 1000 రోజుల పాలనలో ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయం సాధించారని ఎద్దేవా చేశారు. రుద్రంగి మండల అధ్యక్షుడు దయ్యాల ఉదయ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తయినా రుద్రంగి కలికోట సూరమ్మ ప్రాజెక్టు పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. భూ నిర్వాసితుల కుటుంబాలకు ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంతో యాసంగి పంటలకు తీవ్ర నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున యాసంగిలోపు సూరమ్మ ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చనందుకు నిరసనగా ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను బహిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి మండల ఇంచార్జి ధర్నా ఎల్లయ్య, రుద్రంగి మండల ఉపాధ్యక్షుడు ఏనుగందుల సతీష్, మండల ప్రధాన కార్యదర్శి పోసు తిరుపతి, రుద్రంగి గ్రామ ప్రధాన కార్యదర్శి లింగాల రవీందర్, కట్కూరి హనుక్, గసికంటి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## హిందూ దేవుళ్ళపై వివాదాస్ప వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం

**మల్యాల సెప్టెంబర్ 29 (జనంసాక్షి)**

ఢిల్లీలో జరిగిన ఓ మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, శివుడు పేదల దేవుడు, రాముడు ధనికుల దేవుడు అని, బీజేపీ ధనికుల పార్టీ అంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా మండల కేంద్రంలోని బ్లాక్ ఆఫీస్ వద్ద మంగళవారం బిజెపి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసాల్లో శివుడు, శ్రీరాముడు విడదీయ రాని దైవ స్వరూపాలని సమాజంలో హిందువుల విశ్వాసాలను విభజించడానికి ప్రయత్నించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ఓట్ల కోసం దేవుళ్లను, భక్తులను, ప్రాంతాలను విభజించే రాజకీయాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలనీ? సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్, ప్రధాన కార్యదర్శి పిల్లి రాజశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొనుగంటి గౌతం, మద్దుట్ల సర్పంచి సంకుర్తి తిరుపతి, బండారి రాజు, అనిల్, నేరెళ్ల వర్షిత్, తదితరులు పాల్గొన్నారు.



## మల్యాల మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే సత్యం

**మల్యాల సెప్టెంబర్ 29 (జనంసాక్షి)**

మల్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో స్వాతి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులు సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఎమ్మార్వో శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



### విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను

## సద్వినియోగం చేసుకోవాలి

**- జర్మనీ, ఇజ్రాయెల్, ఆస్ట్రియా, ఐర్లాండ్ తదితర దేశాల్లో వివిధ కొలువులు : కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 29(జనంసాక్షి) :**

జిల్లాలోని నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్ కామ్ )ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో పలు ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీ, ఇజ్రాయెల్, ఆస్ట్రియా, ఐర్లాండ్, సౌదీ అరేబియా, మారిషస్, ఖతార్, దుబాయ్, ఒమన్, మలేషియా, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో వివిధ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. జర్మనీ: నర్సులకు నెలకు ఏ యు ఆర్ 2,800, ఉద్యోగాలకు 2,800--3,000, ఫిజియోథెరపిస్ట్, ఉద్యోగాలకు 2,500--2,900 వరకు వేతనాలు లభిస్తాయని, ఇజ్రాయెల్: ఓం బేసుడు కే ర్ గివెర్స్ కు నెలకు రూ. 1,99,000కు పైగా వేతనం ఉంది. ఆస్ట్రియా: నర్సులకు 2,800 వేతనం లభిస్తుందని, ఐర్లాండ్: రిజిస్టర్డ్ నర్సులకు కు ఈ యు ఆర్. 3,100 వేతనం అందుబాటులో ఉంది. సౌదీ అరేబియా: రిజిస్టర్ నర్స్ కు సౌదీ రియాల్ 5,400 వేతనం ఉందని, మారిషస్: రిజిస్టర్ నర్స్ జనరల్ వార్డులో రూ. 59,000, స్పెషలైజ్ నర్స్ కు రూ. 71,000 వేతనం, ఖతార్: రిజిస్టర్ నర్స్ కు క్యూ ఏ ఆర్ 5,000 వరకు వేతనం, దుబాయ్: క్యాబ్ డ్రైవర్స్ కు నెలకు ఏ ఈ డి 2,500--3,500, ఈ బైక్ రైడర్స్ కు ఏ ఈ డి. 2,500--6,000, టైల్స్, మేషన్, స్టీల్ ఫిక్చర్, సేటరింగ్, కార్పెంటర్, స్కఫ్ ఫోల్డర్, ఉద్యోగాలకు ఏ ఈ డి1,453, జనరల్ హెల్పర్ ఏ ఈ డి 1,200 వరకు వేతనం, ఒమన్: అగ్రికల్చర్ వర్కర్స్ కు నెలకు ఓఎంఆర్ 160 వేతనం, మలేషియా: హెవీ వర్కర్స్, స్టీల్ ఫిక్చర్, పైపు వెల్డర్, ఎక్స్ కావేటర్, బ్యాక్ ఆపరేటర్ ఉద్యోగాలకు =వీ 1,700--2,000 వేతనం, అమెరికా: రిజిస్టర్ నర్స్ (ఆర్ ఎన్)లకు సంవత్సరానికి వి70,000--95,000 ఫిజీ: వివిధ రంగాల్లో గంటకు ఎఫ్ జె 6 నెలకు ఎఫ్ జె1,250--1,460 వేతనాలు, ఆస్ట్రేలియా: కార్పెంటర్ ,వెల్డర్, ఫి ట్టర్, ఎలక్ట్రిషన్, సివిల్ కన్స్ట్రక్షన్ తదితర ఉద్యోగాలకు గంటకు ఏ యు డి ఎస్. 26.44 వరకు వేతనాలు ఉన్నాయని వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా ఉపాధికల్పనాదికారి కార్యాలయం, కలెక్టరేట్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, రూమ్ నెం. 233లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 08035524946, 8125737731,9291237999,0423342040 నంబర్లను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## నేటి సీఎం సభను విజయవంతం చేయండి

### ఏఎంసీ చైర్మన్ తిరుపతి

**రుద్రంగి సెప్టెంబర్ 29 (జనంసాక్షి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మార్కెట్ చైర్మన్ చేలుకల తిరుపతి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు సంబంధించిన ఏర్పాట్లు, గ్రామాల వారీగా ప్రజలు, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తరలించడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ సభను జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, రుద్రంగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రం గంగానర్సయ్య, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మండల ఉపాధ్యక్షుడు అక్కినపెల్లి శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, ప్యాక్స్ డైరెక్టర్లు తర్రె మనోహర్, సనుగుల గంగాధర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్లలో హరిత శోభ - మొక్కలు నాటేందుకు సర్పంచ్ సన్నాహాలు

**రుద్రంగి, సెప్టెంబర్ 29 (జనం సాక్షి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని వేములవాడ – కోరుట్ల ప్రధాన రహదారిలో గల డివైడర్ల మధ్యలో మొక్కలు నాటేందుకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. ఈ మేరకు గ్రామ సర్పంచ్ గండి నారాయణం ఆధ్వర్యంలో సోమవారం డివైడర్లను మట్టితో నింపే పనులను ప్రారంభించారు. రహదారి మధ్యలో ఉన్న డివైడర్లలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో మట్టిని నింపి, అందులో పూల, నీడనిచ్చే మొక్కలు నాటనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గండి నారాయణం, ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి లు మాట్లాడుతూ, మండల కేంద్రాన్ని పచ్చదనంతో, అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. డివైడర్లలో మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు, వాహనదారులకు కనువిందుగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, సింగిల్ విండో డైరెక్టర్ ధర్నా మల్లేశం, మండల అధ్యక్షుడు ఎర్రం గంగ నరసయ్య, సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గట్ల మీనయ్య, వార్డు సభ్యులు పూదరి మహిపాల్, అంబటి శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, తర్రె లింగం, కొమర శంకర్, పల్లి గంగాధర్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## కోల్ ఇండియా స్థాయి లో రాణించాలి: జిఎంలు

**రామగిరి జనం సాక్షి(సెప్టెంబర్ 29):**

కోల్ ఇండియా స్థాయిలో రాణించి సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు అన్నారు. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంపెనీ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాట్మెంటన్ పోటీలను మంగళవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,× అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా పాల్గొని, పతాకావిష్కరణ గావించి, రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో బెల్లంపల్లి-మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం -1ఓ2, రామగుండం 3 -భూపాలపల్లి, మణుగూరు-ఇల్లందు, కార్పోరేట్-కొత్తగూడెం ఆరు రీజియన్ల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యం తోపాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందని, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలను ప్రతి గ్రామంలో ఆడేవారని అన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఉద్యోగుల క్రీడల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయిసూ క్రీడాకారులనుప్రోత్సహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి క్రీడా కారుడు నైపుణ్యాన్ని పెంచుకొని రాణించాలని, ఆరోగ్యమైన ఉద్యోగులు ఉంటే, ఆరోగ్య సింగరేణి గా ఉంటుందన్నారు. కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించి సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని అన్నారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి ఎన్.వంశీధర్, కార్పొరేట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ ఫాస్ట్ నెట్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బుర్ల సదానందం, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, స్పోర్ట్స్ సూపర్వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చింది

## కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటే అన్ని వర్గాలను విస్మరించాయి: అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 జనంసాక్షి:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారులు పై వచ్చిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం నిజామాబాద్ అర్బన్ కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ సాక్షిగా రైతులకు అనేక హామీలు ఇచ్చి ఒకటి నెరవేర్చలేదని మండిపడ్డారు. రెండు లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ రైతు భరోసా, భూమిలేని రైతు కూలీలకు 12 వేల ఆర్థిక సాయం, రైతు పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే ఉంటుందని, వరి క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామని చెప్పి విస్మరించిందన్నారు. కేవలం రైతులనే కాకుండా మహిళలకు, యువతీ యువకులకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఎల్ నినో ప్రభావం రాష్ట్రం పై తీవ్రంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిన పట్టించుకోలేదన్నారు. సమయం దాటిన తర్వాత ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెప్పడం విడ్డూరమన్నారు. అప్పటికే రైతులు వరి వేసుకున్నారని గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీ, పోసి ప్రక్షాళన అంటూ లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు కానీ రైతులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ వ్యవహరించిన మాదిరిగానే కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు.కేంద్ర ప్రభుత్వం అన్ని పథకాల్లో తన వాటాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తామే చేస్తున్నట్లు ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బోధన్ నుంచి జగిత్యాల వరకు 320 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ చేపట్టడం అభినందనీయమని చెప్పారు



కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, హరీష్ రెడ్డి, సుగంధం హరీష్, పద్మా రెడ్డి, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు రాము, మల్కాయి మహేందర్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, ఓబీసీ మోర్చరాష్ట్ర ప్రతినిధి స్వామి యాదవ్, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు వనిత, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జస్పాల్ సింగ్, యువ మోర్చ రాష్ట్ర సహా కోశాధికారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్గల్ మండలం కాస్లాబాద్ గ్రామస్తుడు చింతాకి సాయిగోండ (50) సోమవారం తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య బీరవ్వ తెలిపిన వివరాల ప్రకారం... తన భర్త సాయిగోండ సుమారు గత ఆరు నెలల క్రితం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, సోమవారం సాయంత్రం ఉరి వేసుకున్నట్లు మరిది తెలుపగా హైదరాబాద్ నుంచి తాము రాత్రి వచ్చి చూసినట్లు తెలిపారు. తన భర్త కడుపు నొప్పి భరించలేక జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని, ఎటువంటి అనుమానం లేదని తెలిపారు. మృతుని భార్య బీరవ్వ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## సీఎం వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి..

**హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ధర్నా..**

**గంభీరావుపేట, సెప్టెంబర్ 29 (జనంసాక్షి):** హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో సీఎం తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బీజేపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో కోడె రమేష్, జిల్లా ధార్మిక క్షేత్ర అధ్యక్షుడు సత్యనారాయణ, మల్లేష్ యాదవ్, బోయన్నగారి శీను, బండ దేవయ్య, ఎక్కాల దేవి చంద్రం, తిరుపతి, శ్రీను, దుర్గేష్, ఎలిందర్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు



# సిరికొండ అభివృద్ధి సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యే భూపతిరెడ్డికి పంచాయతీ పాలకవర్గం వినతి

**సిరికొండ, సెప్టెంబర్ 29 (జనంసాక్షి ):**
సిరికొండ గ్రామంలోని పలు కీలక సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ మల్లెల సాయిచరణ్, ఉపసర్పంచ్ గ్యామ శోభన్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామానికి అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ప్లాట్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని కోరారు. ప్లాట్లు పొందిన అర్హులకు ఇళ్ల నిర్మాణానికి మంజూర్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.సిరికొండలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 100 కిలోలీటర్ల సామర్థ్యం గల ఒక ట్యాంకు, 90 కిలోలీటర్ల సామర్థ్యం గల మరో ట్యాంకు నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే పోచమ్మగుడి నుంచి డోంట్లవాగు వరకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సిరికొండ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయడంతో పాటు అవసరమైన స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బందిని నియమించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఎస్సీ కాలనీలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని, ప్రీ-ప్రైమరీ పాఠశాలకు అదనపు గదులు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. గ్రామంలోని ఇళ్ల మధ్య ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను గ్రామం బయటకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సర్వే నంబర్ 532 భూమి సమస్యను పరిష్కరించి, భూమిలేని నిరుపేదలకు భూమిని పంపిణీ చేయాలని ఎమ్మెల్యేను కోరారు.గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రతిపాదించిన సమస్యలపై ఎమ్మెల్యే భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించి, దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అల్లిపురం కిషన్, ఇందూరి అమృత, చిట్యాల రంజిత్, ఎరుకల ఎల్లయ్య, కొలిపాక అశ్విని, కానపురం సునీత, బాదావత్ తిరుపతి, బోల్గం

# సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు నాయకులు తరలి రావాలి..**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ పిలుపు..**

**చిగురుమామిడి సెప్టెంబర్ 29(జనంసాక్షి):**
ఈనెల 30న కరీంనగర్,రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు,ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని చిగురుమామిడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ లో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనానికి ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని సురేష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 33నెలలుగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం నడుస్తుందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు దేశానికి ఆదర్శంగా పరిపాలన నడుస్తుందని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న మహాసంకల్పంతో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అనునిత్యం పని చేస్తున్నారని చెప్పారు. 2గంటల నుండి అన్ని గ్రామాల నుండి బస్సుల్లో తరలిరావాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనను సంప్రదించాలని పిలుపునిచ్చారు.



ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి, సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి,మండల ఉపాధ్యక్షుడు పచ్చిమట్ల జగన్ గౌడ్, నాయకులు వంటకాల సంపత్ రెడ్డి,పింగిలి సంపత్ రెడ్డి,దోమ శ్రీనివాస్ రెడ్డి,కాత తిరుపతి,డైరెక్టర్లు మహమ్మద్ కుదుపుద్దిన్,పోటు మల్లారెడ్డి, పిల్లి కొమరయ్య,జిల్లెల్ల రమేష్,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జర్నలిస్టులు వృత్తి ధర్మంతో పనిచేయాలి :పోచారం శ్రీనివాసరెడ్డి, కే. శ్రీనివాస్‌రెడ్డి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29 (జనం సాక్షి)**
రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు హాజరయ్యారు.

**వాస్తవ సమాచారమే అందించాలి**

ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని సూచించారు. వార్తలను ప్రచురించే ముందు నిజానిజాలను పూర్తిగా నిర్ధారించుకోవాలని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.

**మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలు**

డిజిటల్, సోషల్ మీడియా విస్తరణతో వార్తలు వేగంగా ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

**మీడియాపై విశ్వాసం పెంచాలి**

మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. నిష్పక్షపాతంగా, నిజాయితీతో వార్తలను అందించడం ద్వారా మీడియాపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆధునిక మీడియా విధానాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు.






**జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత**

బాన్సువాడలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో సుమారు 60 మంది రిపోర్టర్లకు ఇళ్ల స్థలాలతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.



## ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

### - విజేతలకు బహుమతులు అందజేసిన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 29(జనంసాక్షి) :**
సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహించిన పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ వాలీబాల్,కబడ్డీ,ఖోఖో,అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తదుపరి స్థాయి పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన కనబరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, నోడల్ ఆఫీసర్ శోభారాణి,జోనల్ కన్వీనర్ దాసరి రమేష్,మండల కన్వీనర్ ప్రణయ్,సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు,పీఈటీలు,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల వార్డ్ మెంబర్ల కమిటీ ఆధ్వర్యంలో ఎస్సై చంద్రకుమార్ కు సన్మానం




**సుల్తానాబాద్,సెప్టెంబర్ 29(జనంసాక్షి) :**
నూతనంగా ఏర్పడిన మండల వార్డ్ మెంబర్ల కమిటీ సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.మంగళవారం పోలీస్ స్టేషన్ లో ఎస్సైని కలిసి శాలువాతో సన్మానం చేసిన అనంతరం మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణలో చేస్తున్న కృషి తో పాటు ప్రజలకు అందిస్తున్న మెరుగైన సేవలను వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల వార్డు సభ్యుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రామగుండంలోని డీ-అడిక్షన్ సెంటర్..

### - ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ శ్రీరాములు..
### - మాదకద్రవ్యాల వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి..
### - యువత డ్రగ్స్, గంజాయి బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి..

గోదావరిఖని, జనంసాక్షి :





యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీరాములు అన్నారు.మంగళవారం అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు రామగుండంలోని డీ-అడిక్షన్ సెంటర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ డీ-అడిక్షన్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలు, చికిత్సా విధానం, కౌన్సెలింగ్,రోగులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.మాదకద్రవ్యాల బారిన పడిన వారికి మెరుగైన వైద్యం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఆరోగ్య, సామాజిక , ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.జిల్లాలోని అన్ని గ్రామాల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ముఖ్యంగా యువత,విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు, తల్లిదండ్రులు, యువత సమన్వయంతో పనిచేయాలని, బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి తగిన వైద్య చికిత్స అందేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.అనంతరం రామగుండంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు,పారిశుధ్యం,మందుల లభ్యత తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ రవీందర్‌రావు, ఆర్ఐ రాజేందర్, సీడీపీఓ అలేఖ్య, సీ-సెక్షన్ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, సంబంధిత అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

## కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కాళేశ్వరం జోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా..

గోదావరిఖని, జనంసాక్షి :



కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కాళేశ్వరం జోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి,విధులు నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది పనితీరును సమీక్షించారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు.అనంతరం ఎస్ఐ, స్టేషన్ రైటర్,సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్ వివరాల నమోదు,రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీశారు.పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచుగా నమోదయ్యే నేరాలు,గ్రామాల పరిస్థితి, శాంతిభద్రతల పరిస్థితి, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,బాధితులు,ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.రౌడీషీటర్లు,సస్పెక్ట్‌షీట్లో ఉన్న వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి,వారి కదలికలు,కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.ప్రజల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించిన డీఐజీ, రాష్ట్ర సరిహద్దు పోలీస్‌స్టేషన్ కావడంతో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



## స్వర్ణ నంది అవార్డు అందుకున్న జర్నలిస్ట్ శ్రీనివాస్ కు ఘన సన్మానం

### సింగిల్ విండో చైర్మన్ రవీందర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ శుభాకాంక్షలు..

**చిగురుమామిడి సెప్టెంబర్ 29(జనంసాక్షి):**
సామాజిక కార్యకర్త పత్తెం శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక స్వర్ణ నంది అవార్డు రావడం పట్ల మండల కేంద్రంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిగురుమామిడిలో సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన సత్కారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పత్తెం శ్రీనివాస్ సమాజానికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు.ఆయన సేవలను గుర్తిస్తూ స్వర్ణ నంది అవార్డు దక్కడం చిగురుమామిడి మండలానికే గర్వకారణమని వారు పేర్కొన్నారు.అనంతరం శ్రీనివాస్‌కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించి,భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బదుగులు దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పశ్చిమట్ల జగన్ గౌడ్, డైరెక్టర్లు పోటు మల్లారెడ్డి, శ్రీరామోజు రాజకుమార్, చింతపుల సాయన్న,చాడ మహిపాల్ రెడ్డి, పిల్లి కొమురయ్య, కుతాటి తిరుపతి,బొమ్మగాని పరుశురాములు గౌడ్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీనగర్ వేదికగా థాంగ్-టా సమరం

### - ఐపీఎస్ విద్యార్థుల సత్తా




**సుల్తానాబాద్,సెప్టెంబర్ 29(జనంసాక్షి) :**
జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ వేదికగా జరుగుతున్న జాతీయ స్థాయి థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్) విద్యార్థులు తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో నలుగురు విద్యార్థులు వివిధ విభాగాల్లో బరిలోకి దిగారు. ఏ. అద్వైత్ 56 కేజీల విభాగంలో, ఎం. సంప్రీత్ 46 కేజీల విభాగంలో, కె. మైత్రి వరుణ్ 52 కేజీల విభాగంలో, టి. ధనుష్‌కుమార్ 56 కేజీల విభాగంలో పోటీల్లో పాల్గొంటున్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ తరపున తమ ప్రతిభను ప్రదర్శిస్తూ సత్తా చాటుతున్నారు.విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేశారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొంటూ.. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




## మల్కపేట తొమ్మిదవ ప్యాకేజీ పనులను వెంటనే పూర్తి చేయాలి - బిజెపి డిమాండ్

కోనరావుపేట(జనంసాక్షి):



సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతున్నాయని మండలంలో మల్కపేట రిజర్వాయర్ పరిధిలోని తొమ్మిదవ ప్యాకేజీ తక్షణమే పూర్తి చేసి సాగునీరు అందించి రైతన్నను ఆదుకోవాలని బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబెర్ గొట్టే రామచందర్ మాట్లాడుతూ వచ్చే ఏసంగి సీజన్‌కు సరిపడా సాగునీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు గత 2023లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చకపోవడం విచారకరమన్నారు కొనరావుపేట మండల కేంద్రంలో కాలువలు (కెనాల్) నిర్మాణం పూర్తి కాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న కాలువలు రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని కోరారు నిర్లక్ష్యం వీడకుంటే వెంటనే పనులు పూర్తి చేయాలని భూముల పోయిన రైతు లకు డబ్బులు చెల్లించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది కార్యక్రమంలో బోయిని నరసయ్య, దుర్గం తిరుపతి, మల్లేశం అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు